## ఆర్టికల్

# పిల్లల ఆటల్లో జాగ్రత్త వహించండి

❖ దాదాపు ఎనిమిది గంటలకు పైగా చదువులో మునిగితేలే పిల్లల్ని కనీసం సాయం సమయాల్లోనైనా ఆడుకోనివ్వడం ద్వారా వారిలో మానసిక పరిణతి వృద్ధి చెందుతుంది.

❖ చదరంగం లాంటి ఆటలు మేధస్సుకు పదును పెడతాయి.

❖ క్రికెట్ లాంటి ఆటల వల్ల కండరాలు ఉత్తేజితం కావడం, రక్త ప్రసరణ హెచ్చవడం, ఉచ్ఛ్వాస నిశ్వాసాలు బలంగా జరగడం వల్ల రాత్రిపూట హాయిగా నిద్రపోతారు.

❖ పిల్లలు ఆటల్లో గాయపడటం సహజం. అటువంటప్పుడు వారిని కసురుకోకుండా, జాగ్రత్తగా ఆడుకోవాలని బుజ్జగించడం మంచిది.



❖ తగిలిన గాయాలను శుభ్రంగా కడిగి మందు వేసి కట్టుకట్టాలి. అంతే గానీ అదే పోతుం దిలే అనే నిర్లక్ష్య ధోరణి పనికి రాదు.

❖ పిల్లలు ఆడేటప్పుడు తోటి పిల్లలతో గొడవ పడటం సహజం. అలాంటప్పుడు వారికి అర్థమయ్యేలా సామరస్య పూర్వకంగా చెప్పి జాగ్రత్త వహించాలి.

❖పిల్లలుఆటల్లో పాల్గొనేటప్పుడు అసలు పట్టించుకోకపోవడం గానీ, అతిగా పట్టించుకోవడం గానీ చేయరాదు. ఓవైపు వారికివ్వాల్సిన స్వేచ్ఛ నిస్తూనే మరోవైపు వాళ్ళనో కంట కనిపెట్టాలి!

❖ కొందరు పిల్లలకు ఆటలంటే అంత ఇష్టముండదు. అటువంటి వారిని నిందించక మంచి పుస్తకాలు చదవమని చెప్పి ప్రోత్సహించాలి.

❖ పిల్లలు చాలా సున్నిత స్వభావులు. తోటి పిల్లలతో కలిసి ఉన్నప్పుడు వారి నుండి అవలక్షణాలను తొందరగా గ్రహిస్తారు. ఈ విషయంలో పెద్దలే తగు జాగ్రత్త వహించాలి.

❖ ఆదివారాలు, సెలవు రోజుల్లో పిక్నిక్‌లకు తీసుకెళ్ళడం, కొత్త ప్రదేశాలు చూపించడం వల్ల వారిలో విషయ పరిశీలన, సాంఘిక చైతన్యం పెరుగుతుంది.

❖ ఆటల్లో ఓడిపోయినపుడు కొందరు పిల్లలు చాలా బాధపడిపోతారు. ఒక్కోసారి గెలిస్తే ఓడిన వారిని ఎద్దేవా చేయడం జరుగుతుంది. అలా కాకుండా వారి మధ్య సంఘీభావాన్ని, స్పోర్టివ్ స్పిరిట్‌ను పెంపొందించడం తల్లిదండ్రుల బాధ్యతే మరి!

---

కథ ప్లాన్ - సిహెచ్. మధు

'పృధ్వీరాజ్ - పుష్ప'ల పెళ్ళి ఈ మధ్యే రంగ రంగ వైభ వంగా జరిగింది.

పృధ్వీరాజ్ తండ్రికి క్లాత్ షోరూమ్ ఉంది. ఊళ్ళో కొంత పేరున్న ధనవంతుడు!

అల్లుడికి పెళ్ళిలో ఇస్తానన్న, ఒప్పుకొన్న కట్నం డెబ్భైవేలు పెళ్ళి వరకూ సమకూరక పోవడంతో...పుష్ప తండ్రి పృధ్వీరాజ్ తండ్రికి చేతులు జోడించి అయ్యా! ముప్పైవేలు మాత్రమే ఇవ్వగలుగుతున్నాను. మిగతా నలభై వేలు ఒక సంవత్సరంలోగా ఇస్తాను" అని బ్రతిమాలాడాడు...

పెళ్ళి ఆగకూడదని కాళ్ళావేళ్ళా పడ్డాడు.

పృధ్వీరాజ్ తండ్రి సీరియస్‌గా ఆలోచించాడు. పుష్ప తండ్రి అడ్వకేట్ కాబట్టి, మొత్తం కట్నం ఇస్తే తప్ప పెళ్ళి జరగదని ఖచ్చితంగా చెప్తే పోలీసులకు చెప్తాడేమో...తను అనవసరంగా చిక్కుల్లో చిక్కుకుంటాడేమో...ఈ కష్టాలన్నీ దేనికని...అతడు తన వద్ద అప్పు తీసుకున్నట్టుగా బాండ్ రాయించుకొన్నాడు.

పెళ్ళి జరిగిపోయింది.

పెళ్ళి తర్వాత పృధ్వీరాజ్ తల్లి శోభనం ఏర్పాట్లు చేయటం చూసి ఆందోళనపడిన తండ్రి కొడుకును పిల్చి...

"వరకట్నం తీసుకోకుండా శోభనమేమిటీ? మీ అమ్మకేమైనా పిచ్చిపట్టిందా? గర్భవతయితే ఒక్క పైసా కట్నం అడగలేం" అన్నాడు.

కొడుకు పృధ్వీరాజ్ తండ్రి కంటే...చాలా తెలివైన వాడు. తండ్రితో అన్నాడు.

"నాన్నా! ఎందుకలా గాభరా పడ్తావ్! పెళ్ళి చేసుకున్నది భార్యను చూసుకొని మురిసేందుకా? ఈ విషయం నేను ముందే ఆలోచించాను. కట్నం డబ్బులు మొత్తం వచ్చేదాకా గర్భం రాకుండా నేను జాగ్రత్తపడ్తాను! ఒకవేళ కాకూడనిదేదైనా అయితే అబార్షన్ చేయటానికా ఊళ్ళో బోలెడు డాక్టర్లు ఉన్నారు!"

కొడుకు వంక తండ్రి మహా సంతృప్తిగా... సగర్వంగా చూశాడు! ★